క్లుప్తంగా

పశుగణనకు సహకరించాలి



గార్ల: అఖిల భారత 21వ పశుగణన కార్యక్రమానికి రైతులు సహకరించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బోడేపూడి కిరణ్‌కుమార్ కోరాడు. మంగళవారం గార్లలోని పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పశుగణనలో గ్రామాల వారీగా కేటాయించిన ఎన్యుమరేటర్లు ప్రతీ ఇంటిని సందర్శించి ఆవులు, ఎద్దులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, కుక్కలు, కుందేళ్లు, గాడిదలు, గుర్రాలు, ఏనుగులు వంటి వివరాలు సేకరించాలని సూచించారు. ఈ సమావేశంలో పశువైద్యుడు సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రవాణారంగ కార్మికులను ఆదుకోవాలి

నెహ్రూసెంటర్: రవాణారంగ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి కార్మికులను ఆదుకోవాలని ప్రైవేట్ అండ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి సమ్మెట రాజమౌళి అన్నారు. జిల్లా కేంద్రంలోని అర్తిగార్డెన్ సెంటర్‌లో ఆటో కార్మికుల సమావేశం మంగళవారం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నక్క వెంకన్న, కార్యదర్శిగా బొల్లెద్దు మధు, కోశాధికారిగా కొండ నరేష్, సభ్యులుగా షేర్ల శ్రీనివాస్, భూక్య రాజు ఎన్నికయ్యారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

దోర్నకల్: విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తూ ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి చర్య తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.వివేక్ కోరారు. స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర అమలు చేస్తున్న నూతన విద్యావిధానాన్ని అమలు చేయవద్దని, 1, 2వ తరగతులను అంగన్‌వాడీ కేంద్రాలలో కలుపొద్దని కోరారు. డిసెంబర్ 1న కురవిలో జరిగే యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి



మహబూబాబాద్ అర్బన్: యాక్ట్ టు సర్టిఫికెట్ ఇప్పించి డీఎస్సీ–2024 ఉపాధ్యాయులకు వేతనాలు అందించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేశ్ కోరారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డీఈఓ రవీందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శులు పులిచింత విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్, ఉపేందర్, సాంబయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ మహిళ మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో నివాసం ఉండే తల్లాడ స్పందన (37) ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనోవేదనకు గురై ఈనెల 20వ తేదీన ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందగా మృతురాలి కుమార్తె మాధుర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

వరండాలోనే పాఠాలు..

- అసంపూర్తిగా నూతన భవన నిర్మాణం
- పలు పాఠశాలలకు ప్రహరీలు లేక సంచరిస్తున్న పశువులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



కాన్వాయిగూడెం ప్రాథమిక పాఠశాల వరండాలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

పెద్దవంగర: పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా కొన్ని ప్రభుత్వ స్కూళ్లు నాణ్యమైన విద్యను అందిస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. కాని కొన్ని పాఠశాలల్లో ప్రాథమిక విద్య అస్తవ్యస్తంగా మారింది. టీచర్లు ఉంటే విద్యార్థులు లేరు. విద్యార్థులు ఉంటే సమయం పాలన లేని దుస్థితి. ఒకే గదిలో తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు నిదర్శనమే పెద్దవంగర మండలంలోని కాన్వాయిగూడెం ప్రాథమిక పాఠశాల.

మండలంలోని కాన్వాయిగూడెం ప్రాథమిక పాఠశాల్లో 1 నుంచి 5వ తరగతి వరకు 17 మంది మాత్రమే విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల్లో ఒక్కటే భవనం ఉంది. దీంతో గత ప్రభుత్వ పాలనలో రూ.13లక్షలతో ఒక భవనం, మన ఊరు –మన బడి కింద రూ.12లక్షలతో మరో భవన నిర్మాణం పనులు చేపట్టారు. స్లాబ్ వరకు ఒక గది, ప్లాస్టింగ్ వరకు మరోగది పూర్తి అయిన తర్వాత నిధులు సరి పోవడం లేదని పనులు మధ్యలోనే నిలిపి వేశారు. దీంతో ఒక గదిలో స్టాఫ్ రూంగా వినియోగించుకోవడంతోపాటు ఆ గదిలో, వరండాలో 17మంది విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. వీటితోపాటు మండలంలో లొట్లబండ తండా, చిన్నవంగర ప్రాథమిక పాఠశాల, కొరిపల్లితండా, మోత్యాతండా ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు లేక పశువులు సంచరిస్తున్నాయి. బంగారు చెలిమితండాలో ప్రహరీతో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలలు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేక కొట్టుమిట్టాడుతున్నాయి. అధికారులు, పాలకులు చొరవ తీసుకొని ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తా..



కాన్వాయిగూడెం ప్రాథమిక పాఠశాల నూతన భవనాల పనులు మధ్యలోనే నిలిచి పోయాయి. మండలంలోని పలు పాఠశాలలకు ప్రహరీలు లేక పశువులు సంచరిస్తున్న మాట వాస్తవమే. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తమవంతు తోడ్పాటు అందిస్తా.

– బుదారపు శ్రీనివాస్, ఎంఈఓ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కురవి: స్టేషన్‌గుండ్రాతిమడుగులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



డోర్నకల్: మహిళా క్యాంటీన్‌ను పారంభిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కురవి/డోర్నకల్/నర్సింహులపేట/దంతాలపల్లి: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని స్టేషన్‌గుండ్రాతిమడుగు గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. బంగారిగూడెంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, మానుకోట మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, కాలం రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. డోర్నకల్‌లోని స్థానిక మెయిన్ రోడ్డులో సెర్ప్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి భోజనం చేశారు. నర్సింహులపేట మండల కేంద్రంలో మంగళవారం రాత్రి పీఏసీఎస్ నూతన భవనం, గోదాంను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం 10ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు.

కార్పొరేట్ విధానాలతో ప్రజలకు నష్టం



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మహబూబాబాద్: కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు చేస్తున్నాయని సంయుక్త కిసాన్ మోర్చా జాయింట్ ఫ్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు మండల వెంకన్న, అజయ్‌సారథిరెడ్డి, గౌని ఐలన్న, చిన్న చంద్రన్న, ఎస్‌కె.మదార్, కె.వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ అనుకూల విధానాలతో ప్రజలు, రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అన్నిరకాల పంటలకు కనీస మద్దతు ధర వ్యవసాయ ఖర్చులకు 50శాతం అదనంగా జోడించి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, వీరన్న, రాజన్న, సూర్యనారాయణ, శ్రీధర్, లింగన్న పాల్గొన్నారు.

జాతీయస్థాయి చిత్రలేఖన పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తొర్రూరు రూరల్: మండలంలోని అరిపిరాల గ్రామంలోని ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి చిత్రలేఖన పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు, డ్రాయింగ్ టీచర్ నిమ్మల రవి మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఎస్టీపీసీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థి ఎర్రబోయిన రామ్‌చరణ్ మొదటి స్థానాన్ని సాధించి రూ.50వేల నగదుతోపాటు బహుమతి పొందగా, తోట మహేష్ తృతీయ స్థానాన్ని సాధించి రూ.20వేల నగదుతోపాటు బహుమతిని పొందినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి వచ్చే నెల 14న ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం, డ్రాయింగ్ టీచర్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి

- ఎంపీడీఓ రామారావు



జీపీ సిబ్బందిని సత్కరిస్తున్న ఎంపీడీఓ రామారావు

చిన్నగూడూరు: గ్రామ పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని మండల ఎంపీడీఓ రామారావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని గుండంరాజుపల్లి, పగిడిపల్లి గ్రామాల్లో మంగళ వారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రెండు జీపీల్లో ఎక్కువ పని దినాలు పనిచేసిన సిబ్బందిని ఎంపీడీఓ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గుండంరాజుపల్లి పాఠశాలలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పనులను, మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి

- డీఈఓ రవీందర్ రెడ్డి



ఎన్నారైతో కలిసి విద్యార్థినికి పుస్తకం అందజేస్తున్న డీఈఓ

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తనవంతు సహకారం అందించేందుకు ముందుకువచ్చిన ఎన్నారై సంకా సిద్ధాంత్ దాతృత్వం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి అంద్రు రవీందర్ రెడ్డి అన్నారు. మండలంలోని మాధవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ సందర్భంగా మంగళవారం ఎన్నారై సిద్ధాంత్ అల్పాహారం కోసం నాలుగు నెలలకు సరిపడా రూ.15వేలు చెక్కు, ప్రతి విద్యార్థికి ఆల్ ఇన్ వన్ పుస్తకాలు, జామెట్రీ బాక్స్, పరీక్ష కిట్లను అందజేశారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడానికి దాతలు ముందుకు రావాలన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎం సంకా బద్రి నారాయణ, జిల్లా సైన్స్ అధికారి బి.అప్పారావు, గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ లచ్చిరాం నాయక్, ఉపాధ్యాయ బృందం స్నేహలత, నాగయ్య, రమాదేవి, పరమాత్మచారి పాల్గొన్నారు.

సంక్షేమం, ఉపాధి రంగాలకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే మురళీనాయక్



నెల్లికుదురు: జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



పెద్దవంగర: కొరిపల్లిలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



గార్ల: సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

మహబూబాబాద్ రూరల్/నెహ్రూసెంటర్/కేసముద్రం/నెల్లికుదురు/గూడూరు: సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి రంగాలకు ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. మండలంలోని సోమ్లతండా గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు, వేమునూరు గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మురళీనాయక్ మంగళవారం శంకుస్థాపన చేశారు. మానుకోట వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, బాలాజీ, రామచందర్, అమర్ సింగ్, ఎంపీడీఓ రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలుపుతా: ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పెద్దవంగర/తొర్రూరు రూరల్: పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గంట్లకుంట గ్రామంలో రూ.4లక్షల సీసీ రోడ్లు, కొరిపల్లిలో రూ.12లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకుడు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి, ఎంపీడీఓ వేణుమాధవ్, పీఆర్ఏఈ దయాకర్ పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బీఆర్ఎస్‌తండాలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణంకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, గుండా వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు నాగేశ్వరరావు, జాటోత్ ఝాన్సీలక్ష్మి, మాలోత్ వెంకట్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: బయ్యారంలోని అటవీశాఖ కార్యాలయానికి రహదారి నిర్మాణం, గౌరారంలో గ్రామపంచాయతీ కార్యాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య శంకుస్థాపన, రామచంద్రాపురం, లక్ష్మినర్సింహాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: 'నా మనవడిని చెడు అలవాట్లకు బానిస చేస్తారా అని' అడిగిన ఓ వ్యక్తిని ఎదుటి వ్యక్తులు అసభ్యకర పదజాలంతో దూషించగా మనస్తాపనికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామ శివారు చంద్ర నగర్ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడి సోదరుడు రవి, మనవడు సాయి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామ శివారు చంద్రనగర్ కాలనీకి చెందిన గుగులోత్ బాలు మనవడు గుగులోత్ సాయిని బేతోలు గ్రామానికి చెందిన భుజంగరావు, మరోవ్యక్తి పరమేష్ స్థానికంగా ఉన్న ఓ కిరాణ షాపు వద్దకు సోమవారం రాత్రి తీసుకెళ్లారు. సాయికి వారు కూల్ డ్రింక్ తాగించగా గమనించిన బాలు వారితో గొడవకు దిగాడు. దీంతో బాలు జరిగిన సంఘటనపై మంగళవారం ఉదయం కురవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న భుజంగరావు వచ్చి తనపై ఎందుకు ఫిర్యాదు చేశావు అని మళ్లీ బాలుతో గొడవపెట్టుకున్నాడు. మనస్తాపానికి గురైన అతడు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కురవి ఎస్సై వివరాలు సేకరించారు.

సంక్షిప్త సమాచారం

జీఓలపై కేటీఆర్ సమాధానం చెప్పాలి

మహబూబాబాద్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మానుకోటకు వచ్చి లగచర్ల ఘటనకు గురించి మాట్లాడారు కాని, బీఆర్ఎస్ హయాంలో మానుకోట మున్సిపాలిటీకి కేటాయించిన నిధుల గారడి జీఓలను సమాధానం ఇవ్వాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు కుమార్, నవీన్, శ్రావణ్ పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

దంతాలపల్లి: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వెంకన్న, కొమ్ము మురళీ, సోమారపు వెంకటయ్య పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



గూడూరు: భార్యాభర్తల మధ్య జరిగిన గొడవతో ఓ మహిళ కనిపించడంలేదని మహిళ తండ్రి లచ్చిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన ధారావత్ రజిత, భర్త రమేశ్‌ల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 24న రజిత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వస్తుందనుకున్న భార్య సాయంత్రానికి రాకపోవడంతో భర్త బంధువుల ఇళ్లలో వెతికాడు. సమాచారం తెలియకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు



నెల్లికుదురు: తన ఆడబిడ్డ ఇంటికి వెళ్లానని చెప్పి వెళ్లిన ఓ మహిళ తప్పిపోయిన సంఘటన మండలంలోని దుర్గాభవాణి తండాలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన జాటోతు బుజ్జి హైదరాబాద్‌లో ఉంటున్న తన ఆడబిడ్డ అయిన గుగులోతు లావణి ఇంటికి ఈనెల 24న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిందన్నారు. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ దొరకలేదన్నారు. ఆమె భర్త జాటోతు దేమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కురవి: చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని డాక్టర్ సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో డ్రగ్స్, పొగాకుకు దూరంగా ఉండాలని ర్యాలీ చేసి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ విరాజిత, సీహెచ్‌ఓ శ్రీహరి, శ్రీధర్‌కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

కొత్తరేషన్ కార్డులను ఇవ్వాలి

కేసముద్రం: అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని ఎంసీపీఐ జిల్లా నాయకులు మర్రిపెల్లి మొగిలి, బిచ్చానాయక్ మంగళవారం తహసీల్దార్‌కు పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాజేశ్వర్‌రావు, మోహన్, కుమారస్వామి పాల్గొన్నారు.

బాలికల భద్రతే షీటీం లక్ష్యం

మహబూబాబాద్ అర్బన్: బాలికల, మహిళల భద్రతే షీటీం లక్ష్యమని షీటీం ఎస్సై సునంద అన్నారు. మంగళవారం మోడల్ స్కూల్‌లో షీటీం, భరోసా, ఏహెచ్‌టీయూపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భరోసా కోఆర్డినేటర్ జ్యోత్స్న, ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నెల్లికుదురు: 15ఏళ్లుగా సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుధాకర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉపేందర్ పాల్గొన్నారు.

శంకుస్థాపన

కురవి: మండలంలోని నల్లెల్ల గ్రామంలో రైతుల పొలాలకు వెళ్లే డొంకదారిలో ఈజీఎస్ పనుల్లో భాగంగా రోడ్డు పనులకు ఈజీఎస్ఏపీఓ యాకాంబ్రం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మానుకోట మార్కెట్ డైరెక్టర్ కందయ్య, ఈసీ కైలా, నాగరాజు, మల్లయ్య, నారాయణ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

కొత్తగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను చైల్డ్ ఇన్ఫో సైట్(ఆన్‌లైన్)లో పొందుపరచాలని కొత్తగూడ, గంగారం మండలాల ఎంఈఓలు లక్ష్మినారాయణ, రమాదేవి సూచించారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీఆర్పీల సమన్వయ సమావేశంలో వారు మాట్లాడారు. సీఆర్పీలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

సీఆర్టీల నిరసన

బయ్యారం: తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపిస్తూ సీఆర్టీలు మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జగ్గుతండాలోని కస్తూర్బా బాలికల పాఠశాల ఆవరణంలో భోజన విరామ సమయంలో వారు మాట్లాడుతూ.. తమను రెగ్యులరైజ్ చేయటంతోపాటు పేస్కేల్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్టీలు బాబులాల్, భాస్కర్, రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పులువురు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం గొప్పదని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



నెహ్రూసెంటర్: రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు



డోర్నకల్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లిలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



నెల్లికుదురు: స్థానిక కళాశాలలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఎస్టీ వర్గీకరణ చేపట్టాలి



అధ్యక్ష, కార్యదర్శులు

గార్ల: ఎస్టీ వర్గీకరణ చేపట్టి అన్నిరంగాల్లో వెనుకబడిన ఆదివాసీలకు న్యాయం చేయాలని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య పాలకులను డిమాండ్ చేశాడు. మంగళవారం గార్లలో జరిగిన ఆదివాసీ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 22, 23 తేదీల్లో ములుగులో నిర్వహించే ఆదివాసీల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం తుడుందెబ్బ మండల నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా పెండకట్ల సీతారామయ్య, ప్రధాన కార్యదర్శిగా తాటి రవి, ఉపాధ్యక్షుడుగా దబ్బ రాములు, కార్యదర్శిగా మంకిడి సతీష్, సహాయ కార్యదర్శిగా భద్రయ్య, ప్రచార కార్యదర్శిగా సీతారాములు, కోశాధికారిగా బుచ్చిరాములు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.